క్లుప్తంగా

ప్రగతి శీల మహిళా సంఘం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు

పార్వతీపురం టౌన్: పదేళ్లుగా వేర్వేరుగా ఉన్న ప్రగతిశీల మహిళ సంఘాలు ఒక్కటవుతున్నాయని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణి అన్నారు. వర్తక కళాసీల సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8న ఒంగోలులో విలీన సభ జరుగుతుందన్నారు. సంఘాల విలీనం తరువాత భవిష్యత్ ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు జయలక్ష్మి, జన్ని సవిత తదితరులు పాల్గొన్నారు.

5న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తినగర్(ఎస్ఎన్ఎం నగర్)లో శ్రీరామ పాదుకా పట్టాభిషేక పూజా కార్యక్రమాన్ని ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి పార్వతీపురం శాఖ అధ్యక్షులు యిండుపూరు గున్నేశ్వరరావు తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆ రోజు సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. అంతకుముందు ఉదయం 9 గంటల నుంచి టౌన్ పోలీస్‌స్టేషన్ వీధిలోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య యిండుపూరు వెంకటరావు కల్యాణ వేదిక వద్ద తీర్థగోష్ఠి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు, భక్తులు తరలిరావాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

బలిజిపేట: గొలుసు దొంగతనాలు, పేకాట, సారా స్థావరాలు, సంఘ విద్రోహక చర్యలు చేపడుతున్న వారిపై నిఘా నేత్రాన్ని అమలు పరుస్తున్నామని ఎస్ఐ సింహాచలం తెలిపారు. జిల్లా యంత్రాంగం ఇచ్చిన డ్రోన్ కెమెరాను శనివారం ఆపరేషన్ చేసి ఏ విధంగా వినియోగించాలనేది సిబ్బందికి వివరించారు. పలు జంక్షన్ల వద్ద దీనిని ప్రయోగించి ఏమేర పరిసరాలు గుర్తించడం జరుగుతుందనేది తెలుసుకున్నారు. రెండు కిలోమీటర్ల పరిధిలో దీనిని ఆపరేషన్ చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా గొలుసు దొంగతనాల జోరు ఎక్కువగా ఉన్నందున వీటి ద్వారా దొంగను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత శనివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ పోటీల్లో జూనియర్ విభాగంలో కీర్తన, సీనియర్ విభాగంలో సిహెచ్.హైమ ప్రతిభ కనబరిచారు. మండల స్థాయి సైన్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిమాను తిరువీధి రూట్ మ్యాప్ పరిశీలన

సాలూరు: మే నెలలో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి సిరిమాను తిరువీధికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను విద్యుత్ అధికారులు శనివారం పరిశీలించారు. తిరువీధి రోడ్డు మ్యాపులో ఎలక్ట్రికల్ పవర్‌లైన్లు, అవసరమయ్యే ఎలక్ట్రికల్ పోల్స్ తదితర అంశాలపై ఎలక్ట్రికల్ డీఈ కె.గోపాలరావు ఆరా తీశారు. సిరిమాను తిరువీధి ఉత్సవంలో విద్యుత్ లైన్లుకు సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏడీఈ రంగారావు, ఏఈ నాగేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది, శ్యామలాంబ అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో అగ్ని ప్రమాదం

మక్కువ: స్థానిక రజకుల వీధికి చెందిన నగిరికటకం గౌరి ఇంట్లో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గౌరి ఇంట్లో దీపం వెలిగించాడు. ఎలుక దీపాన్ని వస్త్రాలపైకి తీసుకువెళ్లడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి పొగ వచ్చి, మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. పెంకిటిళ్లు నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. సరైన సమయానికి సాలూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని, మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో వస్త్రాలు, ధ్రువపత్రాలు కాలిపోయాయని బాధితుడు గౌరి లబోదిబోమంది.

వివాహ రిజిస్ట్రేషన్లు ఎక్కడ?



- పంచాయితీల్లో కనిపించని వివాహ నమోదు ప్రక్రియ
- కార్యదర్శులకు, ప్రజలకు కొరవడిన అవగాహన

పంచాయితీల్లో నమోదు

వివాహం జరిగిన పంచాయితీల్లోనే కార్యదర్శులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. జనన, మరణ ధ్రువపత్రాల మాదిరిగానే వివాహ రిజిస్ట్రేషన్ నమోదు పత్రాలు పొందవచ్చు. వివాహం జరిగిన 21రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

చాటుగా బాల్య వివాహాలు

అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయనేది చర్చనీయాంశమైంది. ఆర్థిక సమస్యలు, అవగాహన లోపంతోనే ఇవి సాగిపోతున్నాయి. ప్రజల్లో పూర్తిగా చైతన్యం లోపించింది. ఎంతో భవిష్యత్ ఉన్న ఆడపిల్లల జీవితాలు బాల్య వివాహాలతో చెల్లాచెదురవుతున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు కొంతవరకు బాల్య వివాహాలను అడ్డుకుంటున్నా అక్కడక్కడా జరిగిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి.



బలిజిపేట: అధికారుల నిర్లక్ష్యమో... లేక అలక్ష్యమో తెలియదుగాని.. చట్టం పని తాను చేయడం లేదనేది నగ్న సత్యంగా కనిపిస్తుంది. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని మొత్తుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయితీల్లో వివాహ నమోదులు తప్పనిసరని ప్రభుత్వం చెబుతున్నా.. ఎక్కడా అది అమలు కావటం లేదనే చెప్పాలి. అంతేకాక బాల్య వివాహాలు జరుగుతునే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివాహ నమోదు తప్పనిసరి చేయాలని 2002లో చట్టం చేశారు. జీఓ – 193 ప్రకారం ప్రతీ గ్రామంలో కార్యదర్శులు వివాహాలను నమోదు చేయాలని చట్టం రూపొందించారు. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మత ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా 2012లో క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి ఈ చట్టాన్ని వర్తింపజేశారు.

అవగాహనా లోపంతోనే..

వివాహ రిజిస్ట్రేషన్ నమోదుపై కార్యదర్శులకు అంతగా అవగాహన లేకపోవడంతో గ్రామాల్లో ప్రజలకు చెప్పడంలో విఫలమవుతున్నారనేది కాదనలేని నిజం. కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప వీటిపై అవగాహన అంతగా లేదంటున్నారు. వివాహాలకు ఆడపిల్లలకు 18సంవత్సరాలు, మగ పిల్లలకు 21ఏళ్లు తప్పనిసరి అని గ్రామాల్లో అవగాహన కల్పించాల్సి ఉంది.

పట్టించుకోని అధికారులు

వివాహం చేసుకునే ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనలను అధికారులు అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే తప్ప ఐసీడీఎస్ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వీటిపై పంచాయితీ వారు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం ముందుగా చెప్పటం లేదు

గ్రామాల్లో వివాహాలు చేసుకునే ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులకు వారు తెలియపరచటం లేదు. వివాహం జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే వాటి వివరాలు సేకరించి బాల్యవివాహాలు కాకపోతే అభ్యంతరం పెట్టటం లేదు. ఏది ఏమైనా ముందుగా చెప్పాల్సిన బాధ్యత వారికి ఉంది.

– సులేఖ, సీడీపీఓ, బలిజిపేట

అంకెల గారడీ బడ్జెట్ : రాజన్నదొర



పీడిక రాజన్నదొర

సాలూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదని, బడ్జెట్ అంతా అంకెల గారడిలా ఉందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలను మోసం చేస్తోందన్నారు. తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు సంక్షేమానికి ఎక్కడ నిధులు కేటాయించారో చెప్పాలన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలకు నిధులు కేటాయించలేదన్నారు. ఇది ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని దుయ్యబట్టారు. తల్లికి వందనం ఇస్తామని ఒక ఏడాది ఎగ్గొట్టారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన మోసపూరిత హామీలు అమలు చేయలేక బడ్జెట్‌లో చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలైనా ఏ ఒక్క పథకం అమలు చేసిన అతీగతి లేదన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి

- ఆశ వర్కర్ల డిమాండ్



కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు


పార్వతీపురం టౌన్: పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆశ వర్కర్ల జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.శివాని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ పట్నాన కామేశ్వరరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పని భారం తగ్గించాలని, సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని కోరారు. కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 6న ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉన్న ఆశ వర్కర్స్ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జి.వెంకటరమణ, వాకాడ ఇందిర, శివాని, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, ఎం.గౌరి, టి.పద్మావతి, జి.భాగ్యలక్ష్మి, ఎం.పద్మావతి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేతన జీవులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

- ఏఐటీయూసీ నేతల విమర్శ

పార్వతీపురం టౌన్: సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసే వేతన జీవుల ఆశలను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అడియాసలు చేశారని ఏఐటీయూసీ ప్వాతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ ఆరోపించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేస్తామన్నారు తప్ప జీతాల కోసం పని చేస్తున్న కార్మికులకు బడ్జెట్‌లో చోటు ఇవ్వలేదన్నారు. ఎటువంటు జీఓ ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం చూస్తే గడ్డి చూపించి గుర్రాన్ని పరిగెత్తించడం వంటిదేనని విమర్శించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు తమకు మినిమం టైం స్కేల్, ఉద్యోగాల పర్మినెంట్ అవుతాయని పెట్టుకున్న ఆశలపై తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ, ఐఆర్ ఊసేలేదని, వారికి చెల్లించాల్సిన వేలాది కోట్ల రూపాయలు బకాయిల ప్రస్తావన, కేటాయింపుల్లేవన్నారు. ఆయన వెంట ఆ సంఘ నాయకులు సింహాద్రి దుర్గారావు, ఈవీ నాయుడు పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వే : డీఎంహెచ్ఓ



ఎమ్మార్ నగరంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

పార్వతీపురం రూరల్: వైద్య సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని పెదబొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఎమ్మార్‌నగరం, చినబొండపల్లిలో నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వేను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సర్వే చేసినపుడు బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, ఎత్తు, బరువులను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే గర్భాశయ, నోటి, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలను చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీ, సీడీ సర్వేల ద్వారా ప్రజల ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైన చికిత్సలను అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సర్వేల వల్ల ముందస్తుగా వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పరిశీలనలో వైద్యాధికారులు జి.ధరణి, టి.పద్మావతి, జిల్లా గణాంకాధికారి శంకరరావు, ఎంపీహెచ్‌ఈఓ టి.వెంకటనాయుడు, సీహెచ్ఓ నందిని తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర వలంటీర్లకు శిక్షణ

పార్వతీపురం టౌన్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం ఆవిష్కరణకు అడుగులు పడుతున్నాయని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు తెలిపారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమం వలంటీర్‌లకు టీటీడీ కల్యాణ మండపంలో శనివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్, జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజలతో కలిసి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను సుందరంగా తీర్చిదిద్దడమే స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యం అన్నారు. అన్ని పంచాయతీలలో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఉద్యమ రూపంలో చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్‌లకు ఆయన అభినందించారు. ఈ నెల 12వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి తీసుకోవాలని సూచించారు.

నేటి నుంచి నూతన చలానా విధానం

మక్కువ: డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నూతన చలాన జీఓ విడుదల చేసినట్లు ఎస్ఐ వెంకటరమణమూర్తి శనివారం తెలిపారు. ఆదివారం నుంచి మండలంలో నూతన చలన విధానం అమలు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇస్తే గతంలో జరిమాన వెయ్యి రూపాయలు ఉండేదని ప్రస్తుతం 5000 రూపాయలు పెరిగిందన్నారు. సీటుబెల్ట్, హెల్మెట్ ధరించకపోతే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. మైనర్లు వాహనం నడిపితే పదివేల రూపాయల జరిమాన విధిస్తామన్నారు. ప్రజలు నూతన జీఓని గమనించి విధిగా వాహన పత్రాలు, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. వాహనాల తనిఖీలు నిరంతరం జరుగుతాయని ఆయన తెలిపారు.

విధులకు ఉపాధ్యాయుడు డుమ్మా..

- నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజనానికి దూరం

సాలూరు రూరల్: మండలంలోని జిల్లేడువలస గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాలకు శనివారం డుమ్మా కొట్టడంతో విద్యార్థులు చదువుతోపాటు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ నాలుగు రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయుడు రావడం లేదని తెలిపారు. నాలుగు రోజులుగా ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు ఆటలకే పరిమితమవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుడు ఇలాగే డుమ్మా కొడుతున్నారని గ్రామస్తుడు లక్ష్మణ తెలిపాడు. ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పార్వతీపురం రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ వై.జయలక్ష్మి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం 2.0 ప్రకారం సారాయితో పట్టుబడిన వ్యక్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవన శైలిని కొనసాగించాలన్నారు. సులభతరంగా సంపాదించాలనే అత్యాశతో చెడు మార్గాలను అన్వేషించడం చట్టప్రకారం నేరమన్నారు. ఈ సందర్భంగా సారాయితో పట్టుబడిన సీహెచ్ ఉదయ్ కుమార్, వి.ఇందు, ఎ.సురేష్, పి.నగేష్, పి.వినోద్ తదితరులపై బైండోవర్ కేసును నమోదు చేశారు. శనివారం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో సారాయి వినియోగం వల్ల వచ్చే దుష్ప్రభావాలను అబ్కారీ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు.

ఇది ఎగవేతల బడ్జెట్

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి సూపర్ సిక్స్‌కు ఎలాంటి నిధులు కేటాయించకుండా ఎగవేతల బడ్జెట్‌ను రూపొందించారని మండల పరిషత్ అధ్యక్షురాలు మజ్జి శోభారాణి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మహిళలను మోసగించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం, స్త్రీనిధి, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ పథకాలకు నిధులు కేటాయించలేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు అరకొరగా నిధులను కేటాయించి అన్ని వర్గాల వారికి మోసం చేసిందన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని జిల్లా ఆరోగ్యసేవల కో ఆర్డినేటర్ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం పట్టణంలో ఏరియా ఆస్పత్రిని ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో ఓపీ, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు తదితర అంశాలపై ఆరా తీశారు. వంద పడకల ఆస్పత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వీఆర్.మీనాక్షి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

● ఈ నిర్లక్ష్యం క్షమించరానిది!



జాతీయ జెండాపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన శకటంలో ఉన్న రైతు భరోసా కేంద్ర నమూనాను కలెక్టరేట్ ఆవరణలో ఉంచారు. ఆ నమూనా రైతు భరోసా కేంద్రంపై రెండు జాతీయ పతాకాలను ఏర్పాటు చేశారు. రిపబ్లిక్ డే జరిగి రెండు వారాలవుతున్నా.. వాటిని తొలగించకుండా అలాగే నిర్లక్ష్యంగా వదిలేశారు. వీటిని చూసిన వారు ఔరా.. ఇంత నిర్లక్ష్యమా? అంటూ విస్తుపోతున్నారు.

– పార్వతీపురం టౌన్

● మోడల్ స్కూల్ పేరుతో మాబడి తొలగించొద్దు



మోడల్ స్కూల్ పేరిట మా ఊరి బడిని తొలగించొద్దని బలిజిపేట మండలం పలగర పంచాయతీ గుడివాడ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద శనివారం ఆందోళనకు దిగారు. పాఠశాల చైర్మన్ వి.శ్యాంబాబు, దేవి తదితరులు మాట్లాడుతూ తామంతా మడ్డువలస రిజర్వాయరు ముంపు గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చిన నిర్వాసితులమని గుర్తు చేశారు. ఇక్కడ తలదాచుకుంటూ తమ పిల్లల్ని ఇక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నామని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఇక్కడే ఉంటూ 500 కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. అప్పటి నుంచి ఇక్కడే తమ పిల్లల్ని చదివించుకుంటున్నామని తెలిపారు. మోడల్ స్కూల్ పేరుతో తమ పాఠశాలను తొలగిస్తే ఎలాగని ప్రశ్నించారు. నారాయణరావు, బుడ్డి, జయమ్మ, నూకమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

– బలిజిపేట

● వాటర్ ప్యాకెట్లు కాదండోయ్...



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి తాగి పడేసిన వాటర్ ప్యాకెట్లు అనుకుంటే పొరపాటే.. పార్వతీపురం పట్టణ నడిబొడ్డున గల వరహాల గెడ్డలో వందల సంఖ్యలో సారా ప్యాకెట్ల కవర్లు ఇలా శనివారం దర్శనమిచ్చాయి. అధికారులు ఓ వైపు జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దుతామంటూ చెబుతుంటే మందుబాబులు దాన్ని సవాల్ చేస్తున్నారు. మన్యం జిల్లా కేంద్రంలోనే తాగి పడేసిన సారా ప్యాకెట్లు కోకొల్లలుగా ఉండడంతో పట్టణవాసుల్లో చర్చనీయాంశమైంది.

– పార్వతీపురం టౌన్

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీధర్

పార్వతీపురం రూరల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని సీఐ కె.మురళీధర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్, ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థినిలు, మహిళలు ఎవరైనా నివాస ప్రాంతాల్లోగాని, ఇతర ప్రాంతాల్లోగాని ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న రికార్డుల పరిశీలన, పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని రూరల్ ఎస్ఐ బి.సంతోషి నిర్వహించారు.

నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఏడీఏ మధు

సీతానగరం: మండలంలోని లైసెన్స్ పొంది ఎరువులు విక్రయిస్తున్న నిర్వాహకుల దుకాణాల్లో రైతులకు ఎరువులు ఇచ్చి ఖచ్చితమైన రశీదులు ఇవ్వాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని విజిలెన్స్(సాలూరు)ఏడీఏ బి.మధు అన్నారు. సీతానగరం, బూర్జ, మరిపివలస గ్రామాల్లో ఎరువుల దుకాణాలలో ఎరువుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను శనివారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో రైతులకు నిర్దేశించిన ధరకు విక్రయించాలని, ఎరువులు లభ్యత, ఎరువుల ధరల పట్టిక విధిగా ఉంచాలని సూచించారు. ఎప్పటికప్పుడు రైతుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎరువుల గోదాంలో నిల్వలను పరిశీలించి గోదాంలో ఉన్న సరుకు వివరాలు రికార్డుల్లో ఉన్న వివరాలను సరి చూశారు. రబీ సీజనులో వ్యవసాయ పంటలు పండిస్తున్న రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

క్రాష్‌తో నీటి ఎద్దడికి చెక్

సీతానగరం: మండలంలోని వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు ఏక కాలంలో మరమ్మతులు చేపట్టడం కోసం క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించడం జరిగిందని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 558 బోర్లున్నాయని మొదటి రోజున అంటిపేట, వీబీ పేట, వెంకటాపురంలో బోర్లు బాగు చేయడం జరిగిందన్నారు. అలాగే రోజుకు రెండు గ్రామాల్లో బోర్లు మరమ్మతులు చేయనున్నట్టు తెలిపారు. బోర్ మెకానిక్ సత్యనారాయణ, బంకురు కృష్ణ, వంగపండు కృష్ణ పాల్గొన్నారు.